సాక్షి జగిత్యాల

మంగళవారం । 22 । ఆగస్టు । 2023



కొండపై సందడి

మల్లాపూర్ : శ్రీసోమేశ్వరకొండపై శ్రావణం సందర్భంగా భక్తుల రద్దీ పెరిగింది. పూజలు చేసిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.



నృసింహునికి పూజలు

ధర్మపురి: పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, యూపీ ఎమ్మెల్యే పీఎన్ పాఠక్ శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు.

గరిష్టం/కనిష్టం 31.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

లలిత సహస్ర పారాయణం



తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న వసంత

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని నవదుర్గా సేవా సమితి సోమవారం చేపట్టిన లలిత సహస్ర పారాయణంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంత పాల్గొన్నారు. జిల్లా ప్రజలు దుర్గాదేవి దయతో సుభిక్షంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. జెడ్పీటీసీ మహేశ్, సర్పంచ్ స్వప్న, ఎంపీటీసీ శేఖర్‌రెడ్డి, నవదుర్గా సేవా సమితి ట్రస్ట్ సభ్యులు కస్తూరి శ్రీనివాస్, నాగరాజు, అనుమల్ల చంద్రం, గుండేటి రమణ, జయకృష్ణ, అడువాల లక్ష్మణ్ పాల్గొన్నారు.

క్రీడాకారుల ప్రతిభ



పతకాలతో విద్యార్థులు

జగిత్యాల: హైదరాబాద్ గోల్కొండలో ఆదివారం ప్రారంభమైన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జగిత్యాల పట్టణ విద్యార్థులు ప్రతిభ చూపారు. స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న స్వాతికాంజలి 1,500 మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. ద్వితీయ సంవత్సరం చదువుతున్న మంచ రచన 800 మీటర్ల పరుగుపందెంలో కాంస్య పతకం సాధించింది. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎలేటి ముత్తయ్యరెడ్డి, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ గోలి శ్రీలత, ఫిజికల్ డైరెక్టర్ హరిరాం విద్యార్థులను అభినందించారు.

ఓటింగ్ శాతం పెంపులో వృద్ధులే కీలకం

కోరుట్ల: ఓటరు నమోదు, ఓటింగ్‌లో నైతిక విలువల పెంపు, ఓటింగ్ శాతం పెంపులో సీనియర్ సిటిజన్స్ పాత్ర చాలా కీలకమని ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జాతీయ వయోవృద్ధ దినోత్సవం నిర్వహించారు. తొలుత సీనియర్ సిటిజన్స్‌ను శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడారు. ఈసారి సీనియర్ సిటిజన్స్ కోసం పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్‌లు, వీల్‌చైర్లు, వాహన సౌకర్యం కల్పిస్తామన్నారు. 80ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునే సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. తహసీల్దార్ కిషన్, సీనియర్ సిటిజన్స్ డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానంద్ పాల్గొన్నారు.

కుష్ఠు నియంత్రణకు చర్యలు

మల్యాల(చొప్పదండి): క్షేత్రస్థాయిలో పకడ్బందీగా సర్వే చేపడితే సకాలంలో వ్యాధిగ్రస్తులను గుర్తించి కుష్ఠును నియంత్రించే అవకాశం ఉందని ఎల్‌సీడీసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సంపత్, జిల్లా ఉప వైద్య, ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. మల్యాల, ముత్యంపేటలో సోమవారం క్షేత్రస్థాయిలో కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు చేపట్టిన సర్వేను వారు పరిశీలించారు. జిల్లాలో 744 బృందాలతో సర్వే చేపట్టామని, ఈనెల 31 వరకు ఈ ప్రక్రియ పూర్తిచేస్తామన్నారు. వైద్యురాలు మౌనిక, డీపీఎంవో దేవీసింగ్, పీహెచ్‌ఎన్ నాగలక్ష్మి, హెచ్‌ఈవో రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం



బాధితురాలు జ్యోతి

ధర్మపురి: జైనా గ్రామానికి చెందిన గడ్డి జ్యోతి(35) తన కుమారుడు, కూతురుతో కలిసి గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించింది. భక్తులు స్పందించి వారిని కాపాడారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో ఆమెకు వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం కలిగారు. అయితే, భర్త కరీంనగర్‌లో తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. కుటుంబంతో కలిసి అక్కడే ఉంటున్నాడు. కొంతకాలంగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. మనస్తాపానికి గురైన జ్యోతి.. తన కొడుకు, కూతురుతో కలిసి పుట్టిల్లు జైనాకు వచ్చింది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ధర్మపురిలోని గోదావరి నది వద్దకు చేరుకుంది. సంతోషిమాత మెట్ల వద్ద ఉండగా గమనించిన భక్తులు డయల్ 100 నంబరుకు ఫోన్‌చేసి సమాచారం అందించారు. ఎస్సై దత్తాత్రి సంఘటన స్థలానికి చేరుకున్నారు. జ్యోతి, ఆమె పిల్లలను ఠాణాకు తీసుకెళ్లారు. భర్తను రప్పించి ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించి వేశారు.



కేటీ రామారావు (సిరిసిల్ల)




గంగుల కమలాకర్(కరీంనగర్)




కొప్పుల ఈశ్వర్ (ధర్మపురి)



సుంకె రవిశంకర్ (చొప్పదండి)



రసమయి బాలకిషన్ (మానకొండూర్)



ఎం. సంజయ్ (జగిత్యాల)



ఒడితెల సతీశ్(హుస్నాబాద్)



పుట్ట మధు (మంథని)



కె. చందర్(రామగుండం)



మనోహర్ రెడ్డి (పెద్దపల్లి)

◀ పాతకాపులు



ఇన్ ▶



పాడి కౌశిక్ రెడ్డి (హుజూరాబాద్)



కల్వకుంట్ల సంజయ్ (కోరుట్ల)



చల్మెడ లక్ష్మీనర్సింహారావు(వేములవాడ)

- వేములవాడ, హుజూరాబాద్, కోరుట్లకు నూతన అభ్యర్థులు
- మిగిలిన పదిస్థానాల్లో పాత నాయకులే
- 13లో ఏడుగురు ఓసీ, ముగ్గురు బీసీ, ముగ్గురు ఎస్సీ నేతలు
- మూడోసారి టికెట్ దక్కించుకున్న ఏడుగురు సీనియర్లు
- వివాదాలున్న స్థానాల్లో పాతకాపులే

కారులో ముగ్గురు కొత్తవారు!

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

భారత రాష్ట్రసమితి(బీఆర్‌ఎస్) తన అభ్యర్థులను ప్రకటించింది. 13 అసెంబ్లీ స్థానాలున్న విశాల ఉమ్మడి జిల్లా అభ్యర్థుల జాబితాను సోమవారం ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ప్రకటించగానే.. పాత జిల్లాలో గులాబీ శ్రేణుల సంబురాలు మొదలయ్యాయి. ఇటీవల జాబితాలో ఉమ్మడి జిల్లాలో భారీగా మార్పులు ఉంటాయని ప్రచారం జరిగిన నేపథ్యంలో సీఎం జాబితాపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కానీ.. పాత జిల్లాలో పదిమందిని పాత వారిని, ముగ్గురు కొత్తవారి పేర్లు ప్రకటించి సీఎం.. అందరి అంచనాలను తలకిందులు చేశారు. అంతా ఊహించినట్లుగా వేములవాడ అభ్యర్థిని అందరి కంటే ముందే మారుస్తున్నామని సీఎం ప్రకటించారు. పౌరసత్వం వివాదంలో ఆయన మార్పు అనివార్యమైందని వివరించారు. ఆయన స్థానంలో చెలిమెడ లక్ష్మీనర్సింహారావు పేరును ఖరారు చేశారు. కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే కె.విద్యాసాగర్‌రావు కుమారుడు డాక్టర్ కె.సంజయ్‌ను ప్రకటించారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న విద్యాసాగర్‌రావు కోరిక మేరకు సంజయ్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు సీఎం తెలిపారు. ఇక హుజూరాబాద్‌లో అంతా అనుకున్నట్లుగా ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని ఖరారు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడుగురు సిట్టింగులను మార్చగా ఇందులో జిల్లాకు చెందినవారే ఇద్దరు కావడం విశేషం.

పదిమంది పాతకాపులే..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 13 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇందులో మూడుస్థానాల్లో అభ్యర్థులు మారగా, మిగిలిన 10 స్థానాల్లో సీనియర్లే ఉన్నారు. అందులో సిరిసిల్ల నుంచి మంత్రి కేటీఆర్, కరీంనగర్ నుంచి మంత్రి గంగుల కమలాకర్, ధర్మపురి నుంచి మంత్రి కొప్పుల ఈశ్వర్ పోటీచేస్తారు. చొప్పదండి నుంచి సుంకె రవిశంకర్, మానకొండూరు నుంచి రసమయి బాలకిషన్, హుస్నాబాద్ నుంచి సతీశ్ బాబు, జగిత్యాల నుంచి సంజయ్, పెద్దపల్లి నుంచి దాసరి మనోహర్‌రెడ్డి, రామగుండం నుంచి కోరుకంటి చందర్, మంథని నుంచి పుట్ట మధు బరిలో దిగనున్నారు. ఇందులో సిరిసిల్ల, కరీంనగర్, హుస్నాబాద్, మానకొండూరు, జగిత్యాల మినహా మిగిలిన చొప్పదండి, ధర్మపురి, పెద్దపల్లి, రామగుండం, మంథనిలో ఎమ్మెల్యేలకు వ్యతిరేక పవనాలు వీచాయి. మంత్రి ఈశ్వర్ పెద్దపల్లి పార్లమెంటుకు పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. అదే సమయంలో చొప్పదండి, రామగుండం, మంథని, పెద్దపల్లి ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా స్థానిక నేతలు తిరుగుబాటు చేశారు. మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్, ఈశ్వర్‌ల చొరవతో అవన్నీ సద్దుమణిగాయి.

కులాల వారీగా..

13 అసెంబ్లీ స్థానాల్లో ఏడుగురు ఓసీ అభ్యర్థులు ఉన్నారు. ముగ్గురు బీసీలు, ముగ్గురు ఎస్సీలకు అవకాశం దక్కింది. ఇందులో కేటీఆర్, డాక్టర్ సంజయ్, డాక్టర్ కె.సంజయ్‌కుమార్, చలిమెడ లక్ష్మీనర్సింహరావు వెలమ సామాజిక వర్గానికి చెందిన వారు. పెద్దపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి, హుజూరాబాద్ నుంచి పాడి కౌశిక్‌ది రెడ్డి సామాజిక వర్గం. హుస్నాబాద్ నుంచి సతీశ్‌బాబు బ్రాహ్మణ(కరణం) కాగా, కరీంనగర్ నుంచి కమలాకర్, రామగుండం నుంచి కోరుకంటి చందర్, మంథని నుంచి పుట్ట మధు.. ఈ ముగ్గురూ మున్నూరుకాపు సామాజికవర్గం వారు కావడం విశేషం. సుంకె రవిశంకర్ (చొప్పదండి), రసమయి బాలకిషన్(మానకొండూరు) మాదిగ, కొప్పుల ఈశ్వర్(ధర్మపురి) మాల సామాజిక వర్గానికి చెందివారు కావడం గమనార్హం.

ఏడుగురు మూడోసారి...

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పాతజిల్లాలోని 13 అసెంబ్లీ స్థానాల్లో ఏడుగురు నాయకులు బీఆర్‌ఎస్ టికెట్‌పై మూడోసారి పోటీ చేస్తున్నారు. అందులో కేటీఆర్(సిరిసిల్ల), సతీశ్‌బాబు(హుస్నాబాద్), మనోహర్‌రెడ్డి(పెద్దపల్లి), పుట్ట మధు(మంథని), గంగుల కమలాకర్ (కరీంనగర్), కొప్పుల ఈశ్వర్(ధర్మపురి), రసమయి బాలకిషన్ (మానకొండూరు) ఉన్నారు. డాక్టర్ సంజయ్(జగిత్యాల), సుంకె రవిశంకర్(చొప్పదండి) రెండోసారి బీఆర్‌ఎస్ టికెట్‌పై బరిలోకి దిగనున్నారు. ఇక మిగిలిన నలుగురు లక్ష్మీనర్సింహారావు(వేములవాడ), పాడికౌశిక్‌రెడ్డి(హుజూరాబాద్), డాక్టర్ కె.సంజయ్ (కోరుట్ల), కోరుకంటి చందర్(రామగుండం) తొలిసారిగా బీఆర్‌ఎస్ బీఫాం మీద పోటీ చేయనున్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల సంబురాలు



సంబురాలు చేసుకుంటున్న పార్టీ శ్రేణులు

జగిత్యాలటౌన్: జగిత్యాల అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా డాక్టర్ సంజయ్‌కుమార్ పేరును సీఎం కేసీఆర్ సోమవారం ప్రకటించడంపై ఆ పార్టీ శ్రేణులు జిల్లా కేంద్రంలో సంబురాలు జరుపుకున్నారు. స్థానిక పటేల్ చౌక్, అంబేడ్కర్ చౌక్‌లో బాణసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. బల్దియా చైర్మన్ గోళి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

శ్వాస ఉన్నంత వరకూ ప్రజాసేవలో..

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు



కోరుట్ల: చివరి శ్వాస వరకూ ప్రజాసేవలోనే కొనసాగుతానని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనను నాలుగుసార్లు గెలిపించిన కోరుట్ల సెగ్మెంట్ ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు. తనను ఆదరించిన రీతిలోనే తన కుమారుడు డాక్టర్ సంజయ్‌కు అండగా ఉండాలని కోరారు. ఆరోగ్య కారణాల రీత్యా తన కుమారుడు డాక్టర్ సంజయ్‌కు టికెట్ ఇవ్వాలని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు వినతి చేశానని తెలిపారు. తన వినతిని మన్నించి తన కుమారుడికి టికెట్ ఇచ్చిన సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుకు ధన్యవాదాలు తెలిపారు. తాను కేవలం రాజకీయంగానే ప్రజాసేవలో పాలుపంచుకున్నానని, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని పేర్కొన్నారు. సంజయ్‌ను గెలిపించుకుంటే ఇటు రాజకీయంగా ప్రజాసేవలోనూ, వైద్యుడిగా ఆరోగ్యపరమైన సేవలు అందిస్తారని అన్నారు. తాను పోటీ చేసిన ప్రతీ ఎన్నికల్లోనూ సంజయ్ తన వెంట ఉండి పార్టీ గెలుపు కోసం కృషి చేశారని గుర్తుచేశారు. యువతకు ఉద్యోగ కల్పన విషయంలో డాక్టర్ సంజయ్ ఇప్పటికే కోరుట్ల సెగ్మెంట్‌లో ఐటీ కంపెనీలు ఏర్పాటు చేసే దిశలో ఉన్నారని చెప్పారు.

ఇద్దరూ వైద్యులే.. పేరు ఒకటే..

జిల్లాలో జగిత్యాల, కోరుట్ల సెగ్మెంట్లకు సోమవారం ప్రకటించిన ఇద్దరు అభ్యర్థులు వైద్యులే కావడం.. ఇద్దరి పేర్లు సంజయ్ కావడం బీఆర్‌ఎస్ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జగిత్యాల ఎమ్మెల్యే, మళ్లీ బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేయనున్న అభ్యర్థి మాకునూరు సంజయ్ కాగా, కోరుట్ల సెగ్మెంట్ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్. ఇంటి పేర్లలో మార్పు తప్ప ఇద్దరి పేర్లు, వృత్తి, సామాజిక వర్గం ఒకటే కావడం విశేషంగా చెప్పుకుంటున్నారు.

పాఠశాలలను పర్యవేక్షించాలి

జగిత్యాల: ప్రధానోపాధ్యాయులు పాఠశాలలను నిత్యం పర్యవేక్షించాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి సూచించారు. జిల్లాలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఉన్నతి అభ్యాసన అభివృద్ధిపై సోమవారం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ, విద్యార్థుల అభ్యాసన అభివృద్ధిని, ఉపాధ్యాయుల పనితీరును ప్రధానోపాధ్యాయులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త కొక్కుల రాజేశ్, డైరెక్టర్ రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

మొర ఆలకించండి

ప్రజావాణికి అభాగ్యుల వినతి

జగిత్యాలటౌన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి అభాగ్యులు పోటెత్తారు. వివిధ సమస్యలపై అదనపు కలెక్టర్ లతకు అర్జీలు సమర్పించారు. తమ ఇబ్బందులు తొలగించాలని విన్నవించారు. దరఖాస్తులు స్వీకరించిన అనంతరం లత మాట్లాడారు. ప్రజావాణి ద్వారా అందిన సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరించాలని ఆదేశించారు. అభాగ్యులు ఏమన్నారంటే..



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లత

ప్లాట్లు ఇప్పించండి



బీర్‌పూర్ మండలం సిరిపూర్‌లో పునరావాసం కింద మాకు ప్లాట్లు కేటాయించారు. భూ రికార్డుల ప్రక్షాళనలో కొందరు అక్రమంగా పట్టాలు పొందారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వాటిని రద్దు చేయండి. మా ప్లాట్లు మాకు ఇప్పించండి.

– సిరిపూర్‌వాసులు

కొడుకు అన్నం పెట్టలేడు



నా ఒక్కగానొక్క కొడుకు మల్లేశ్ అన్నం పెట్టలేడు. నా భార్య చనిపోయింది. వృద్ధాప్యంలో ఉన్న. అనాథ బతుకైంది. నాకున్న ఐదెకరాల్లో మూడెకరాలు నా కొడుకు పేరు మీదనే రాసిచ్చిన. మిగిలిన రెండెకరాలు కూడా తీసుకున్నడు. బువ్వ పెట్టుమంటే నన్ను కొట్టిండు. దయజేసి న్యాయం జేయండి.

– తొట్ల కొమురయ్య, తక్కళ్లపెల్లి

హాస్టల్ వసతి లేదు



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదువుతున్న మాకు బీసీ హాస్టల్‌లో వసతి కల్పించడం లేదు. వివిధ గ్రామాల నుంచి వచ్చి చదువుకుంటున్నం. వసతి లేక రాకపోకలకు కష్టంగా ఉంది.

– బాలికల కళాశాల విద్యార్థినులు

భూములు ఆక్రమించిండు



మంత్రి కొప్పుల ఈశ్వర్ పీఏ పైడిపల్లి వామన్‌రావు మా భూములు ఆక్రమించిండు. మా భూముల్లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తే చంపుతానని బెదిరిస్తున్నడు. ఆయనతో మాకు ప్రాణహాని ఉంది. భూములు ఇప్పించండి. మాకు రక్షణ కల్పించండి. – చిన్నాపూర్ గ్రామస్తులు

ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: జిల్లాలోని అర్హులైన యువత ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ ఏడాది అక్టోబరు ఒకటో తేదీ నాటికి 18ఏళ్ల వయసు నిండినవారు అర్హులన్నారు. ఫారం 6 ద్వారా కొత్తగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. డూప్లికేట్ కార్డు కోసం ఈనెల 21 నుంచి సెప్టెంబరు 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఎంపీపీ సాయిరెడ్డి బహిష్కరణ

- ఆయన ప్రోద్బలంతోనే మట్టి తవ్వకాలు
- తీర్మానించిన కోనరావుపేట కుల సంఘాలు
- మరింత ముదిరిన 'కొండ్రికర్ల – కోనరావుపేట' వివాదం



కోనరావుపేటలో సమావేశమైన వీడీసీ సభ్యులు

మెట్‌పల్లిరూరల్: కొండ్రికర్ల–కోనరావుపేట గ్రామాల మధ్య గుట్టపై మట్టి తవ్వకాల వివాదం మరింత ముదిరింది. ఈరెండు గ్రామాల మధ్య బోడగుట్ట(చెరువుగుట్ట) వద్ద ఇటీవల కొండ్రికర్ల గ్రామస్తులు మట్టి తవ్వకాలు చేపట్టారు. వాటిని కోనరావుపేట గ్రామస్తులు అడ్డుకున్నారు. అంతటితో ఆగకుండా రెండు జేసీబీలు, ఒక ట్రాక్టర్‌ను పట్టుకుని తమ గ్రామ పంచాయతీ కార్యాలయానికి తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న కొండ్రికర్లవాసులు.. కోనరావుపేటకు చేరుకుని ఆ వాహనాలు తీసుకెళ్లారు. అయితే, మెట్‌పల్లి ఎంపీపీ సాయిరెడ్డి ప్రోద్బలంతోనే కొండ్రికర్ల గ్రామస్తులు మట్టి తవ్వకాలు చేపట్టారని, తమపై దౌర్జన్యం చేసి వాహనాలు తీసుకెళ్లారని కోనరావుపేటకు చెందిన కుల సంఘాలు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశాయి. ఈమేరకు సోమవారం సమావేశమయ్యాయి. ఎంపీపీ సాయిరెడ్డిని గ్రామ బహిష్కరణ చేస్తున్నట్లు తీర్మానించాయి. సమాచారం అందుకున్న సాయిరెడ్డి.. కోనరావుపేటకు తరలివెళ్లారు. తనకు రెండు గ్రామాల ప్రజలు సమానమేనని, ఎవరికి ఆపద వచ్చినా అండగా ఉంటానని అభయం ఇచ్చారు. తాను న్యాయం కోసం శ్రమిస్తానని చెప్పారు. మట్టి తవ్వకాలతో తనకెలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు.

పారదర్శకంగా మద్యం దుకాణాల డ్రా



డ్రా తీస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా



నంబర్లు చూపుతున్న సిబ్బంది

- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాలక్రైం: జిల్లాలోని 71 మద్యం దుకాణాల కేటాయింపు కోసం లాటరీ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించామని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. స్థానిక వీరూపాక్షి గార్డెన్స్‌లో సోమవారం మద్యం దుకాణాల నిర్వాహకులను లాటరీ పద్ధతిన ఎంపిక చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, మొత్తం 71 దుకాణాలకు 2,636 దరఖాస్తులు అందాయన్నారు. నూతన మద్యం పాలసీ – 2023 ప్రకారం దరఖాస్తుదారుల సమక్షంలో లాటరీ పద్ధతిన మద్యం దుకాణాలు కేటాయించామని చెప్పారు. ఈనెల 4 నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించామన్నారు. పాత మద్యం షాపుల నిర్వాహకులు ఈ ఏడాది నవంబరు 30వ తేదీ వరకు కొనసాగుతారని చెప్పారు. ఇదే ఏడాది డిసెంబర్ ఒకటో తేదీ నుంచి కొత్త మద్యం దుకాణాలు అమలులోకి వస్తాయని వెల్లడించారు. జగిత్యాలలో 1–32 వరకు మద్యం దుకాణాలకు, ధర్మపురిలో 33–46 వరకు, మెట్‌పల్లిలో 47–71 వరకు లాటరీ ప్రక్రియ ద్వారా ఎంపిక చేశామన్నారు. 14 మద్యం దుకాణాలు గౌడ సామాజిక వర్గానికి, 8 ఎస్సీ సామాజిక వర్గానికి, మిగతావి ఓపెన్ కేటగిరీలో కేటాయించామని అన్నారు. దరఖాస్తుల ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.52.72 కోట్ల ఆదాయం సమకూరిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్, సీఐ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆనందంగా ఉంది



మద్యం దుకాణానికి కొత్తగా టెండర్ వేశాం. అదృష్టవశాత్తు మాకు లక్కీడ్రాలో మద్యం షాపు క్కింది. ఇది మాకు ఎంతో ఆనందాన్నిచ్చింది.

– గంగారాంగౌడ్, జగిత్యాల

వంద టెండర్లు వేశాం



మద్యం వ్యాపారంలో నాకు ఇప్పటికే అనుభవం ఉంది. ఈసారి మా గ్రూపు తరపున సుమారు 100 వరకు దరఖాస్తులు సమర్పించాం.

– కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, సిరికొండ, కథలాపూర్



ఉప్పొంగిన భక్తిభావం

జగిత్యాలటౌన్: నాగుల పంచమి సందర్భంగా జిల్లాలోని వివిధ ఆలయాలు సోమవారం భక్తులతో పోటెత్తాయి. ఉదయమే మహిళలు ఆలయాలకు చేరుకుని సమీపంలోని పుట్టల్లో పాలుపోశారు. నాగదేవత తమను చల్లంగా చూడాలని వేడుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

క్లుప్తంగా

థాంక్యూ సార్



సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మరోసారి అవకాశం కల్పించడంపై సీఎం కేసీఆర్‌కు మంత్రి కొప్పుల ఈశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి ధన్యవాదాలు తెలిపారు.

థాంక్యూ మేడమ్





ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల/జగిత్యాల: కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థిగా డా.కల్వకుంట్ల సంజయ్, జగిత్యాల బీఆర్‌ఎస్ అభ్యర్థిగా డాక్టర్ సంజయ్‌కుమార్‌ను ప్రకటించినందుకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తమ ఎంపికకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

'గుండేటి'కి పురస్కారం



గుండేటి రాజు

జగిత్యాల: జగిత్యాలకు చెందిన గుండేటి రాజుకు కళాసేవ పురస్కారం వరించింది. తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో కరీంనగర్‌లో ఈనెల 22న నిర్వహించే ప్రపంచ జానపద కళోత్సవాల్లో పురస్కారం ప్రదానం చేయనున్నారు. రాజు గత మూడు దశాబ్దాలుగా చేస్తున్న కళాసేవకు పురస్కారం అందజేయనున్నట్లు కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అధ్యక్షుడు కృపాదానం తెలిపారు. అవార్డు రావడంపై జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, పాత్రికేయులు టీవీ.సూర్యం, శ్రీనివాస్, బోనగిరి దేవయ్య, ఆనందరావు, మద్దెల సరోజన, కవిత, అనిత అభినందనలు తెలిపారు.

రెగ్యులర్ చేయడం హర్షణీయం



కనక చంద్రంను సన్మానిస్తున్న అధ్యాపకులు

ధర్మపురి: కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేయడం హర్షణీయమని టీజేఎల్‌ఏ-711 రాష్ట్ర అధ్యక్షుడు కనక చంద్రం అన్నారు. సోమవారం ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అతడిని ధర్మపురి, బీర్‌పూర్ ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కాంట్రాక్టు లెక్చరర్ల కష్టాలు తీర్చినా రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ల అసోసియేషన్ తరుపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లెక్చరర్లు చల్ల రామయ్య, చల్ల గంగన్న, ఆడెపు మహేష్, మామిడి శ్రీనివాస్, చెట్టిపెల్లి రజిత తదితరులున్నారు.

మాట్లాడాలని పిలిచి.. కర్రలతో కొట్టి..

- మెట్‌పల్లిలో యువకుడి దారుణ హత్య
- తీవ్రగాయాలతో సతీశ్ అక్కడికక్కడే మృతి
- పాత కక్షల నేపథ్యంలోనే ఘటన..!
- మృతదేహంతో కాలనీవాసుల ఆందోళన
- దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్
- నాలుగు రోజుల వ్యవధిలో రెండు మర్డర్లు
- భయం గుప్పిట్లో పట్టణవాసులు



సతీశ్(ఫైల్)

మెట్‌పల్లి(కోరుట్ల):ఆదివారం రాత్రి సుమారు 11.30గంటల సమయం.. మెట్‌పల్లి పట్టణ శివారులోని జాతీయ రహదారి సమీపంలో ఉన్న బార్ అండ్ రెస్టారెంట్ అది.. దాని చెంతనే నిర్మానుష్య ప్రదేశం.. ఇద్దరు స్నేహితులు కన్నం సతీశ్, నిఖిల్ అక్కడ కూర్చొని ఏదోవిషయంపై మాట్లాడుకుంటున్నారు.. సరిగ్గా అదే సమయంలో ఇద్దరు అక్కడకు చేరుకున్నారు.. సతీశ్‌ను తమ వద్దకు రావాలని పిలిచారు. వారి వద్దకు వెళ్లిన సతీశ్ భుజంపై చెయ్యి వేసి కొద్దిదూరం నడుచుకుంటూ తీసుకెళ్లారు.. ఆ వెంటనే ఒక్కసారిగా దాడికి దిగారు.. అప్రమత్తమైన సతీశ్.. వారిబారి నుంచి తప్పించుకునేందుకు యత్నించాడు.. నిఖిల్ అడ్డుకునేందుకు యత్నించగా.. దుండగులు చంపుతామని బెదిరించి అక్కడి నుంచి పంపించి వేశారు. గాయాలతో పారిపోతున్న సతీశ్‌ను వెంబడించి మరీ పట్టుకొని కట్టెలు, ఇటుకలతో విచక్షణ రహితంగా కొట్టి అక్కడి నుంచి వెళ్లిపోయారు.. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో పడిఉన్న సతీశ్‌ను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. నాలుగు రోజుల క్రితమే కాంగ్రెస్ మైనార్టీ సెల్ నాయకుడు రజాక్ కూడా హత్యకు గురయ్యాడు. ఈ కేసుపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ సమయంలోనే సతీశ్ హత్యకు గురికావడం అలజడి సృష్టించింది. ప్రశాంతంగా ఉన్న పట్టణంలో వరుస హత్యలు చోటుచేసుకోవడం కలకలం రేపుతోంది.



సతీశ్ మృతదేహం

ఆ సంఘటనే కారణమా?

- పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన సతీశ్(27)కు రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒకరి వయసు ఏడాదిన్నర కాగా, మరొకరి వయసు రెండు నెలలు.
- జక్కం రాజేశ్, నవీన్ కలిసి సతీశ్‌పై దాడిచేసి చంపారని ఇన్‌చార్జి డీఎస్పీ వెంకటస్వామి సోమవారం విలేకరులకు తెలిపారు.
- అయితే.. పాత పగతోనే రాజేశ్ తన మిత్రుడు నవీన్‌తో కలిసి సతీశ్‌ను హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు.
- ఐదేళ్ల క్రితం స్థానిక మినీస్టేడియంలో రాజేశ్, సతీశ్ వర్గాల మధ్య ఓ విషయంలో ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా రాజేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి.
- చాలారోజుల తర్వాత రాజేశ్ కోలుకున్నాడు. అప్పటి నుంచి సతీశ్‌పై కక్ష పెంచుకున్నాడు. అదను చూసి హతమార్చి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.
- కేవలం ఈ గొడవేనా.. ఇంకా ఏదైనా కారణం ఉందా? అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు.

హంతకులను పట్టుకోవడానికి రెండు బృందాలు

- మృతుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెంకటస్వామి తెలిపారు.
- దోషులను పట్టుకోవడానికి ప్రత్యేకంగా రెండు పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.
- సతీశ్‌ను కొట్టి చంపిన బార్ అండ్ రెస్టారెంట్ వద్ద సీసీ కెమెరాలు ఉన్నాయి.
- వాటిలో ఈ దృశ్యాలు నిక్షిప్తమై ఉంటాయని భావించిన పోలీసులు.. సీసీ ఫుటేజీలు స్వాధీనం చేసుకొని పరిశీలిస్తున్నారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మృతదేహంతో కాలనీవాసుల ఆందోళన



ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

- సతీశ్ మరణవార్త తెలుసుకున్న కాలనీవాసులు పెద్దసంఖ్యలో ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. ఈనేపథ్యంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. రంగంలోకి దిగిన ఇన్‌చార్జి డీఎస్పీ వెంకటస్వామి.. కోరుట్ల, మెట్‌పల్లి సీఐలతోపాటు పలువురు ఎస్‌ఐలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయ్యాక అంబులెన్స్‌లో మృతుడి ఇంటికి తరలిస్తున్నారు. అయితే, మార్గమధ్యంలోని పాత బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై కాలనీవాసులు ఆందోళనకు దిగారు. దోషులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని, మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కాపురానికి అడ్డొస్తున్నాడనే రజాక్ హత్య



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మెట్‌పల్లి(కోరుట్ల): తన భార్యతో కాపురం చేయకుండా అడ్డు వస్తున్నాడని సులేమాన్ అనే వ్యక్తి మరికొందరితో కలిసి కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు రజాక్‌ను హత్య చేసినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన సులేమాన్ అతడి భార్యకు మధ్య మనస్పర్థలు రావడంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. దీనిపై పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. పంచాయితీలో సులేమాన్ భార్య తరఫున రజాక్ పాలు పంచుకున్నాడు. అయితే రజాక్ ఆమెతో చనువుగా ఉండడం, కాపురానికి రాకపోవడానికి అతడే కారణమని సులేమాన్ కక్ష పెంచుకున్నాడు. రజాక్ అడ్డు తొలిగిస్తేనే కాపురానికి వస్తుందని భావించి అతడిని చంపాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకు తమ్ముడు లతీఫ్‌తో పాటు అతడి స్నేహితులు జక్కం భూమేశ్, సాయి సహాయం కోరాడు. ఈ నెల 16న రజాక్ గాజులపేట శివారులో తను అద్దెకు తీసుకున్న గది వద్దకు వెళ్లాడు. అక్కడ అతన్ని చంపడం కష్టమని భావించి బలవంతంగా ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని రేగుంట రైల్వే వంతెన వద్దకు తీసుకెళ్లారు. అనంతరం కర్రలతో విచక్షణరహితంగా కొట్టి పారిపోయారు. తీవ్రంగా గాయపడ్డ రజాక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 19న మరణించాడు. సోమవారం బస్‌స్టేషన్ వద్ద సులేమాన్, లతీఫ్ ఉన్నారనే సమాచారంతో అక్కడకు వెళ్లి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. భూమేశ్, సాయి పరారీలో ఉన్నారని, తొందరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు.

తలపై బోనాలతో నిరసన



నిరసన తెలుపుతున్న రెండో ఏఎన్‌ఎంలు

జగిత్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం జూలైలో విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేసి ఎలాంటి రాత పరీక్ష లేకుండా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఏఎన్‌ఎంలను వెంటనే రెగ్యులర్ చేయాలని రెండో ఏఎన్‌ఎంల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్ల మధురిమ డిమాండ్ చేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం ఆర్డీవో కార్యాలయం సమీపంలో బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం తలపై బోనాలతో దీక్షా శిబిరం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి అక్కడే ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఏఎన్‌ఎంల సర్వీసును క్రమబద్ధీకరించాలని 6రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో ఏఎన్‌ఎంలు గూడూరి జయప్రద, మమత, పద్మ, స్వరూపరాణి, సుమలత, ఎలిజబెత్, రాజమణి, మధులత పాల్గొన్నారు.

గమ్యం యాప్‌ను వినియోగించుకోవాలి



మొబైల్‌లో గమ్యం యాప్‌ను చూపుతున్న అధ్యాపకులు

మల్లాపూర్(కోరుట్ల): ఆర్టీసీ గమ్యం యాప్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మెట్‌పల్లి డిపో మేనేజర్ వేదవతి అన్నారు. సోమవారం మల్లాపూర్ మండలం మోడల్ స్కూల్‌లో ఆర్టీసీ ఆధ్వర్యంలో గమ్యం యాప్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆర్టీసీ సేవలను ఇంటి వద్ద నుంచే వినియోగించుకునేందుకు గమ్యం యాప్ ఎంతోగానో తోడ్పడుతుందన్నారు. ఈ యాప్‌తో ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్, సూపర్‌లగ్జరీ బస్‌లకు సంబంధించిన వివరాలు ఇంటి వద్దే తెలుసుకుని నిర్ణీత సమయానికి బస్‌స్టేషన్‌లకు వెళ్లి సమయానుకూలంగా ప్రయాణం చేయవచ్చన్నారు. ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి తమ విలువైన ప్రాణాలను కోల్పోవద్దని, సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకునేందుకు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరారు. విద్యార్థులు, వికలాంగులు, కిడ్నీ రోగులకు ఆర్టీసీ బస్‌పాసు సౌకర్యం కల్పిస్తుందన్నారు. అనంతరం మోడల్ స్కూల్ అధ్యాపకుల మొబైల్స్‌లో గమ్యం యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. కార్యక్రమంలో డిపో పీఆర్ పోలాస రాజశేఖర్(కండక్టర్), ప్రిన్సిపాల్ అలీమొద్దీన్, అధ్యాపకులు లచ్చిరాంనాయక్, నరేష్, మురళి, సురేందర్, హేమంత్, భాగ్యలక్ష్మి, నవీన్, సాయిచందర్, సందీప్, రాధిక, నవీన్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, మహేష్, నరేందర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

కథలాపూర్(వేములవాడ): బదిలీలకు సంబంధించి రాష్ట్ర శాసనసభ ఆమోదం తెలిపినందున కోర్టు అనుమతితో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్టీఎఫ్) జిల్లా ఉపాధ్యక్షుడు చౌడారపు రాంప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గంభీర్‌పూర్, కథలాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యార్థులకు సరైన బోధన అందడంలేదన్నారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకుడు సాయికృష్ణ, మండల బాధ్యులు యాగండ్ల గంగాధర్, అహ్మదుల్లాఖాన్, కర్ణాకర్, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

దొంగలించారు.. వదిలేశారు



సీసీ ఫుటేజీలో వాహనం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మండలంలోని పలు గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు వాహనాలను దొంగలించి వదిలేశారు. వెల్లుల గ్రామ పంచాయతీ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి ద్విచక్రవాహనాన్ని చోరీ చేసిన దుండగులు కొద్ది దూరం వరకు వెళ్లాక వాహనం ఆగిపోవడంతో అక్కడే వదిలేసి మరో ద్విచక్ర వాహనాన్ని దొంగలించారు. వెల్లుల నుంచి ఆత్మకూర్ వెళ్లి ద్విచక్రవాహనాన్ని అక్కడే వదిలి గ్రామంలోని నేరేళ్ల శంకర్‌కు చెందిన టాటా ఏస్ వాహనాన్ని దొంగలించారు. టాటాఏస్ వాహనాన్ని సైతంమెట్‌పల్లి బస్ డిపో ప్రాంతంలో వదిలివెళ్లారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న శంకర్ అక్కడికి వచ్చి వాహనాన్ని తీసుకెళ్లాడు.

గంజాయి పట్టివేత

రామగుండం: మహారాష్ట్ర నుంచి రైలులో గంజాయి తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రామగుండం ఇన్‌చార్జి ఎస్సై జీవన్ వివరాల మేరకు.. గోదావరిఖని తిలక్‌నగర్‌కు చెందిన శనిగరపు రఘువీర్ మహారాష్ట్రలోని బల్లార్షా నుంచి గుర్తుతెలియని వ్యక్తుల వద్ద గంజాయి తీసుకొని ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌లో రామగుండంకు తీసుకువస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. రైల్వేస్టేషన్‌లో అతడిని అదుపులోకి తీసుకొని సోదా చేయగా 620 గ్రాముల గంజాయి లభ్యమైంది. నిందితుడిని రామగుండం తహసీల్దార్ ఎదుట పోలీసులు హాజరుపరిచారు.

కరెంట్ షాక్‌తో రైతు మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన రైతు దాసరి శివప్రసాద్ (33) సోమవారం కరెంట్ షాక్‌తో మృతిచెందాడు. స్థానికుల వివరాలు.. శివప్రసాద్ పొలం వద్ద గల వ్యవసాయ మోటారు కనెక్షన్ వైరు తెగి ఉండడాన్ని గమనించక కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

11,411మంది కొత్త ఓటర్లు

- జనవరి నుంచి ఆగస్టు వరకు పేర్లు నమోదు
- విడుదలైన ముసాయిదా ఓటరు జాబితా

జగిత్యాల: జిల్లాలో కొత్త ఓటర్ల సంఖ్య 11,411గా తేలింది. కలెక్టర్, ఎన్నికల అధికారి యాస్మిన్ బాషా ప్రత్యేక చొరవ తీసుకుని 18ఏళ్లు నిండిన అర్హులైన వారు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని విస్తృత ప్రచారం చేశారు. దీంతో ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా 11,411 మంది కొత్త ఓటర్లు తమ పేర్లు నమోదు చేసుకున్నారని, ఇందులో పురుషులు 5,600 మంది కాగా, మహిళా ఓటర్లు 5,809 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు.

2023 జనవరి 5న విడుదలైన ముసాయిదా ఓటరు జాబితా

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	సర్వీస్ ఓటర్లు
కోరుట్ల	223867	107331	116536	0	47
జగిత్యాల	213287	103419	109853	15	43
ధర్మపురి	210896	103826	107068	2	131
మొత్తం	648050	314576	333457	17	221

2023 ఆగస్టు 21న విడుదలైన ముసాయిదా ఓటరు జాబితా

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	సర్వీస్ ఓటర్లు
కోరుట్ల	227521	109083	118436	2	47
జగిత్యాల	217831	105693	112123	15	43
ధర్మపురి	214109	105400	108707	2	131
మొత్తం	659461	320176	339266	19	221

కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి

- ఉత్తరప్రదేశ్ బీజేపీ ఎమ్మెల్యే పీఎన్ పాఠక్



మాట్లాడుతున్న పీఎన్ పాఠక్

పెగడపల్లి(ధర్మపురి): తెలంగాణలో కేసీఆర్ కుటుంబపాలన సాగుతుందని రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు చరమగీతం పాడాలని, ఇందుకు ప్రతి బీజేపీ కార్యకర్త కృషి చేయాలని ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఖుషీనగర్ బీజేపీ ఎమ్మెల్యే పీఎన్ పాఠక్ అన్నారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో అధికారమే లక్ష్యంగా అమలుకు సాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిన కేసీఆర్ ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, నిరుద్యోగభృతి పేరుతో ప్రజలను మోసం చేసి లక్షల కోట్లు దండుకున్నారని విమర్శించారు. మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కొత్తగా బీసీ బంధు, మైనార్టీ బంధు, గిరిజన బంధు, గృహలక్ష్మీ పేరుతో మరోసారి గద్దెనెక్కాలని చూస్తున్నారని, ప్రజలు వీటిని నమ్మి మోసపోవద్దన్నారు. అవినీతి పాలన, వారసత్వ రాజకీయాలు, మత సంతుష్టీకరణకు బీజేపీ వ్యతిరేకమని, అందుకే వచ్చే ఎన్నికల్లో బీజేపీని బలపరచాలని కోరారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బీజేపీ కార్యకర్తలు ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి తెలంగాణలో అధికారమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. మండల అధ్యక్షుడు కొమురెల్లి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, అధికార ప్రతినిధి సత్యం, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనసూర్య, అసెంబ్లీ కన్వీనర్ సత్యం, నాయకులు మోహన్‌రెడ్డి, అమర్‌నాథ్, కిశోర్, రవీందర్‌రెడ్డి, మల్లేశం, గంగాధర్, బాబు, కుమారస్వామి, అంజి, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను ఇబ్బంది పెడితే చర్యలు



వివరాలు తెలుసుకుంటున్న చంద్రమోహన్

జగిత్యాలజోన్: వృద్ధులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ కటుకం చంద్రమోహన్ తెలిపారు. జిల్లా స్పెషల్ సబ్ జైల్లో సోమవారం ప్రపంచ సీనియర్ సిటిజన్ డే నిర్వహించారు. వృద్ధుల పోషణ భారం నుంచి తప్పుకున్నా చర్యలు కఠినంగానే ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జైలర్ మొగిలేశ్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సతీశ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ విజయ్‌కుమార్, హెడ్ వార్డర్ మజారొద్దీన్ పాల్గొన్నారు.

పొలంలోనే ఆగిన రైతు ఊపిరి



సత్తయ్య (ఫైల్)

ధర్మపురి: పొలంలో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు రైతు మృతిచెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. మండలంలోని నాగారం గ్రామానికి చెందిన రైతు పసుల సత్తయ్య (38) సోమవారం పొలం పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం పని చేస్తుండగా పొలంలో జారిపడడంతో తల బురదలో కూరుకుపోయింది. అక్కడే ఉన్న తొమ్మిదేళ్ల కొడుకు రవిస్వామి తండ్రిని లేపడానికి ప్రయత్నించాడు. అతడివల్ల కాకపోవడంతో సత్తయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య సుజాత, కొడుకు రవిస్వామి, కూతురు రజిత ఉన్నారు. దీపావళి మంచి రోజుల్లో కూతురు వివాహం చేయాలని అనుకున్నారు. కాగా కూతురు పెళ్లి చేయకుండానే తండ్రి మృతి చెందడం ఆ కుటుంబంలో విషాదం నింపింది. డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మృతుడి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. దహన సంస్కారాలకు రూ.5 వేల ఆర్థిక సాయంతో పాటు 50 కిలోల బియ్యం అందజేశారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన ఎనగందుల శంకరయ్య (60) మృతదేహం సోమవారం ధర్మపురి మండలం గాదేపల్లి శివారు ఎస్సారెస్పీ కాలువలో లభించింది. ఎస్సై గౌతంపవార్ కథనం ప్రకారం.. శంకరయ్య శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. అతడి తమ్ముడు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో కాలువలో మృతదేహం లభించింది. తాగి నీటిలో పడిపోయాడా లేదా ప్రమాదవశాత్తు పడిపోయాడా అన్న విషయంపై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

తెలంగాణలో బీజేపీదే అధికారం



మాట్లాడుతున్న బీజీ పాటిల్

జగిత్యాలటౌన్: కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పనిచేస్తే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కర్ణాటక బీజేపీ ఎమ్మెల్సీ బీజీ పాటిల్ ధీమా వ్యక్తం చేశారు. ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా సోమవారం జగిత్యాల అసెంబ్లీ స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పాటిల్ హాజరై మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేసి తెలంగాణలో బీజేపీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, బల్దియా బీజేపీ ఫ్లోర్ లీడర్ అనుమల్ల కృష్ణహరి, నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు వీరబత్తిని అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

కోరుట్లరూరల్: కోరుట్ల నియోజకవర్గంలో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతీ నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే మదన్ ఎరావా అన్నారు. మండలంలోని పైడిమడుగులో సోమవారం అమ్మవారి ఆలయ ఆవరణలో బీజేపీ మండలస్థాయి శక్తి కేంద్రం ఇన్‌చార్జీలు, సహ ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో పార్టీ బలోపేతానికి, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించటంపై దృష్టి సారించాలని కోరారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు జేఎన్ సునీతావెంకట్, రాజుగౌడ్, సాంబారి ప్రభాకర్, యాదగిరి సర్పంచ్ గుగ్గిళ్ల తుక్కారాంగౌడ్, ఎంపీటీసీ పంచిరి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.